GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 53 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## సంజయ్ రౌత్‌కు 15 రోజుల జైలుశిక్ష

పరువు నష్టం కేసులో శివసేన-యూబీటీ కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భాజపా నేత కిరీట్ సోమయ్య, ఆయన భార్య మేధ సోమయ్య దాఖలు చేసిన పరువునష్టం.



ముంబయి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: పరువు నష్టం కేసులో శివసేన-యూబీటీ కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భాజపా నేత కిరీట్ సోమయ్య, ఆయన భార్య మేధ సోమయ్య దాఖలు చేసిన పరువునష్టం కేసులో సంజయ్ను గురువారం ముంబయి కోర్టు దోషిగా తేల్చింది. 15 రోజుల సామాన్య జైలు శిక్షతోపాటు రూ.25 వేలు జరిమానా విధించింది. శిక్షను నిలుపు చేయాలని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తీర్పు అనంతరం సంజయ్ తరపు న్యాయవాది కోర్టులో రెండు అభ్యర్థనలను దాఖలు చేశారు. దీనికి కోర్టు అనుమతినివ్వడంతో సంజయు బెయిల్ లభించింది. కోర్టు తీర్పుపై స్పందించిన సంజయ్ రౌత్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు తనను బలిపశువును చేశారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.

## 'లాడెన్ జీవిత చరిత్ర చదవండి': విపక్ష నేత సతీమణి వ్యాఖ్యలపై దుమారం

ఓ విపక్ష నాయకుడి సతీమణి చేసిన ప్రసంగం వివాదాస్పదమైంది. ఆ మాటలపై భాజపా విమర్శలు గుప్పించింది.



ముంబయి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం 'ఇండియా' బ్లాక్ నేతలకు ఓ అలవాటని భాజపా మండిపడింది. మహారాష్ట్ర సీనియర్ నేత శరద్ పవార్ పార్టీకి చెందిన నేత జితేంద్ర అవధ్ సతీమణి మాట్లాడిన మాటలే ఈ విమర్శలకు కారణం. సమాజంలో నెలకొన్న పరిస్థితులే ఒసామా బిన్లాడెన్ను ఉగ్రవాదిగా మార్చాయని వ్యాఖానించిన ఆమె.. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరును ప్రస్తావించడం తీవ్ర వివాదాస్పదమైంది. ఇంతకీ ఏం జరిగిందంటే..? జితేంద్ర అవధ్ సతీమణి రుతా అవధ్ ఓ బహిరంగ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఒసామా బిన్ లాడెన్ జీవిత చరిత్ర చదవండి. కలాం ఎలా రాష్ట్రపతి అయ్యారో.. లాడెన్ ఎలా ఉగ్రవాదిగా మారాడో అర్థం చేసుకోవడానికి దానిని చదవండి. అతడు ఉగ్రవాదిగా ఎందుకు మారాడు..? అతడు ఆ మార్గాన్ని ఎంచుకోవడానికి సమాజం నుంచి అతడికి ఎదురైన పరిస్థితులే కారణం" అని వివరించారు. దీనిపై భాజపా తీవ్రంగా స్పందించింది. "ఎన్సీపీ(ఎస్పీ) నేత సతీమణి లాడెన్ను సమర్థిస్తూ మాట్లాడారు. ఆ సమయంలో కలాం ప్రస్తావన తెచ్చారు. ఉగ్రవాదులను సమర్థించడం ఇండియా బ్లాక్ కు అలవాటే" అని మండిపడ్డారు. అయితే ఈ విమర్శలపై స్పందించిన రుతా.. తన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు.

## పోలీసులు వెంబడించడంతో వ్యక్తి మృతి .. మూక దాడికి పాల్పడిన గ్రామస్థులు

మొరాదాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తి మరణించాడు. దీంతో గ్రామస్థులు పోలీసులపై మూక దాడికి పాల్పడిన ఘటన ఉత్తరప్రదేశ్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మొరాదాబాద్కు చెందిన సోనూ అనే వ్యక్తి అక్రమ మైనింగ్కు పాల్పడ్డాడని సమాచారం అందింది. అరెస్టు చేయడానికి పోలీసులు అతడి ట్రాక్టర్ను వెంబడించారు. వారి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా సోనూ ప్రమాదవశాత్తూ ఆ వాహనంపై నుంచి పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పోలీసుల వల్లే అతడు మరణించాడని ఆరోపిస్తూ వారిపై రాళ్లు రువ్వుతూ, దాడులకు పాల్పడ్డారు. పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఠాకూర్ద్వారా-జస్పూర్ రహదారిని దిగ్బంధించారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. "ఇవి చాలా తీవ్రమైన ఆరోపణలు.. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నాం. ఘటనలో ప్రమేయమున్న నలుగురు పోలీసులపై కేసు నమోదు చేశాం. తదుపరి విచారణ కొనసాగుతోంది" అని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.



## చదరంగ విజేతలకు రూ.25 లక్షల నజరానా ప్రకటించిన సీఎం

చెస్ ఒలింపియాడ్లో స్వర్ణపతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.25 లక్షల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: చెస్ ఒలింపియాడ్లో స్వర్ణపతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.25 లక్షల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారతదేశం తరపున తొలిసారి స్వర్ణపతకాలు సాధించిన క్రీడాకారులు అర్జున్, ద్రోణవల్లి హారిక జూబ్లీహిల్స్లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించిన సీఎం.. రూ.25 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు చదరంగ విజేతలను అభినందించారు.

## హైదరాబాద్ నుంచి అయోధ్య, కాన్పూర్, ప్రయాగ్‌రాజ్ ప్రాంతాలకు విమాన సర్వీసులు

ప్రజల డిమాండుకు అనుగుణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు.. హైదరాబాద్ నుంచి అయోధ్య, కాన్పూర్, ప్రయాగరాజ్ ప్రాంతాలకు విమాన సర్వీసులు నేడు ప్రారంభం కానున్నాయి.




హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: ప్రజల డిమాండ్కు అనుగుణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు.. హైదరాబాద్ నుంచి అయోధ్య, కాన్పూర్, ప్రయాగరాజ్ ప్రాంతాలకు విమాన సర్వీసులు నేడు ప్రారంభం కానున్నాయి. నేటి(సెప్టెంబర్ 27) నుంచి హైదరాబాద్-కాన్పూర్, హైదరాబాద్-అయోధ్య మధ్య వారానికి 4 రోజుల సర్వీసును, రేపటి(సెప్టెంబర్ 28) నుంచి హైదరాబాద్-ప్రయాగరాజ్, హైదరాబాద్-ఆగ్రా మధ్య వారానికి 3 రోజుల సర్వీసును ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నగరం నుంచి ఇలా ఒక్క నెలలోనే 7 నూతన సర్వీసులను ప్రారంభించడంపై కేంద్ర మంత్రి కిషన్రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నూతన సర్వీసులు ఆయా నగరాల మధ్య ప్రయాణికుల డిమాండ్ను నెరవేరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కొత్త సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తిరుమలలో డిక్లరేషన్ రూల్ జగన్కూ వర్తిస్తుంది :వైఎస్ షర్మిల

జగన్ సర్కారు తిరుమల లడ్డూను కల్తీ చేసిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: జగన్ హయాంలోనే తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. లడ్డూలకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ల్యాబ్లో నిర్ధరణ అయిందని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన నిజానిజాలు ప్రజలకు తెలియాలని డిమాండ్ చేశారు. మళ్లీ తప్పు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై పీసీసీ అధ్యక్షురాలిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి తాను లేఖ రాసినట్లు తెలిపారు. లడ్డూ కల్తీ ఘటనను సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని కోరామన్నారు. మరోవైపు జగన్ తిరుమల పర్యటనలో డిక్లరేషన్ అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆమె స్పందించారు. డిక్లరేషన్ రూల్ అందరికీ వర్తిస్తుందన్నారు. "రూల్స్ అప్లైడ్ ఫర్ ఆల్ పీపుల్" అని వ్యాఖ్యానించారు.




## తిరుమల వెళ్లే ప్రతి ఒక్కరూ తితిదే నిబంధనలు పాటించాలి :సీఎం చంద్రబాబు

తిరుమల శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ తితిదే నిబంధనలు పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: తిరుమల శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ తితిదే నిబంధనలు పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు "భక్తుల మనోభావాలు, ఆచారాలకు భిన్నంగా ఏ ఒక్కరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్లాది మంది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రం. ఈ దివ్యక్షేత్రం ఏపీలో ఉండటం మనందరి అదృష్టం. ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు, భక్తుల మనోభావాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. తిరుమల దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు అత్యంత నియమనిష్టలతో, శ్రద్ధాసక్తులతో స్వామివారిని ఆరాధిస్తా-రు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఆలయ నియమాలు, ఆగమశాస్త్ర ఆచారాలను, తితిదే నిబంధనలను తప్పక పాటించాలని కోరుతున్నా. భక్తుల మనోభావాలకు, ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

## జగన్ తిరుమల పర్యటన రద్దు

ఎమ్మెల్యే జగన్ తిరుమల పర్యటన రద్దయింది



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమల పర్యటన రద్దు అయింది. తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో ఆయన శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో డిక్లరేషన్పై ఆయన సంతకం చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. ఈ క్రమంలో జగన్ తన తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరికాసేపట్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడనున్నారు.

## అంబటి మురళి అపార్టుమెంట్ నిర్మాణానికి అనుమతుల్లేవ్..: ఎమ్మెల్యే ధూళిపాళ్ల



గుంటూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: వైకాపా నేత అంబటి మురళి గుంటూరులో నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణానికి కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ అనుమతులు లేవని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. దీనిపై విజయవాడలోని పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిత్య ఇన్ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నాలుగు టవర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి 2015 జులై 9న పర్యావరణ అనుమతులు తీసుకున్నారని, అయితే 2019 జులై12న ఆ ఒప్పందం రద్దు అయ్యిందన్నారు. జూట్ మిల్లు ప్రతినిధులు, భజరంగ్ అర్బన్ ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకుని కొత్త ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. పాత ఈసీని తమ పేరుపై బదిలీకి దరఖాస్తు చేసుకున్నా అనుమతి రాలేదన్నారు. ఆదిత్య ఇన్ఫ్రాటెక్ సమర్పించిన డిజైన్, ప్లాన్కు ఇప్పుడు భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా ఇచ్చిన ప్లాన్కు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ కోసం ఈసీ క్లియరెన్స్ తీసుకోలేదని స్పష్టం చేశారు. అందుకే దీనిపై విచారణ జరపాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారుల్ని కోరినట్లు చెప్పారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం భారీ బహుల అంతస్థుల నిర్మాణాలకు పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేయడం నిబంధనలు ఉల్లంఘించినట్లవుతుందని వివరించారు. మోసపూరితమైన విధానంతో భజరంగ్ సంస్థ చేపట్టిన నిర్మాణాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# బీవీఆర్ఐటీ కళాశాల బస్సులు ఢీ...

## ఒకరి మృతి, 20 మందికి గాయాలు

**మెదక్ జిల్లాలో నర్సాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా 20 మంది గాయపడ్డారు.**



నర్సాపూర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27:మెదక్ జిల్లాలో నర్సాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని క్లాసిక్ గార్డెన్ వద్ద బీవీఆర్ ఐటీ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్లు బస్సుల్లో ఇరుక్కుపోవడంతో బయటకు తీయడానికి శ్రమించాల్సి వచ్చింది. వారిలో నాగరాజు (50) మృతిచెందారు. 20 మందికి పైగా విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఆస్పత్రులకు తరలించారు. ఘటనాస్థలానికి నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్–సంగారెడ్డి మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ న్ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు, కళాశాల సిబ్బంది చర్యలు చేపట్టారు.

# లక్ష ఇళ్లు రాత్రికి రాత్రే ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయి?: కేటీఆర్

**తాము నిర్మిస్తే.. కాంగ్రెస్ కూల్చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: తమ పార్టీ విధానం నిర్మాణం.. కాంగ్రెస్ విధ్వంసమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తాము నిర్మిస్తే.. కాంగ్రెస్ కూల్చేస్తోందన్నారు. హైడ్రా కూల్చివేతలు, రెండు పడక గదుల ఇళ్లపై ఆయన వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "భారాసది నిర్మాణం.. కాంగ్రెస్ విధ్వంసం. మా హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టలేదని మభ్యపెట్టారు. మేం కట్టిన ఇళ్లనే మూసీ బాధితులకు కేటాయిస్తున్నారు. లక్ష ఇళ్లు రాత్రికి రాత్రే ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయి? మహానగరంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించాం. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్ధాలు అనడానికి మరో సాక్ష్యమిదే" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సాగు నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం :మంత్రి నిమ్మల

**రైతు సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు సాగునీటి వ్యవస్థకు పునరుజ్జీవం తీసుకురావాలని నిర్ణయించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: రైతు సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు సాగునీటి వ్యవస్థకు పునరుజ్జీవం తీసుకురావాలని నిర్ణయించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సాగు నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధమన్నారు. నవంబర్ మొదటి వారంలోగా ఎన్నికలు పూర్తి చేస్తామని వెల్లడించారు. నిర్వీర్యమైన సాగు నీటి వ్యవస్థను.. సాగునీటి సంఘాల ద్వారా రైతుల ప్రాతినిధ్యంతో గాడిలో పెడతామన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఇరిగేషన్ వ్యవస్థలో పూడికతీత, మరమ్మతులు, గేట్లు, గట్ల వంటి వాటికి నిర్వహణ, పర్యవేక్షణ లేదని ధ్వజమెత్తారు. వైకాపా పాలన రైతులకు శాపంగా మారిందన్నారు. నేడు రైతుల ప్రాతినిధ్యంతో ఇరిగేషన్ శాఖ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి చివరి ఎకరం వరకు సాగు నీరు అందేలా సాగు నీటి సంఘాల ప్రాతినిధ్యంతో ఇరిగేషన్ శాఖ ప్రణాళికాబద్ధంగా పని చేస్తుందని స్పష్టం చేశారు.



# ఆర్టీఐ ఆఫీస్లో రచ్చరచ్చ.. ప్రభుత్వ ఉద్యోగిపై కమిషనర్ల చిందులు

**రాష్ట్ర ఆర్టీఐ కార్యాలయంలో సమాచార కమిషనర్లు రచ్చరచ్చ చేశారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: రాష్ట్ర ఆర్టీఐ కార్యాలయంలో సమాచార కమిషనర్లు రచ్చరచ్చ చేశారు. ఆర్టీఐ కమిషనర్లు రోజూ కార్యాలయానికి వచ్చి సంతకం చేయాల్సి ఉంది. అయితే వారెవరూ అలా చేయకపోవడంతో జీతాలు ఇవ్వలేదు. వేతనాలు చెల్లించకపోవడంపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యాలయానికి వచ్చి ప్రభుత్వ సూపరింటెండెంట్పై చిందులేశారు. ఉద్యోగి, ఆర్టీఐ కమిషనర్ల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం జరిగింది. రూల్స్ పాటిస్తున్నామని ఉద్యోగి చెబుతుంటే.. వివక్ష చూపుతున్నారంటూ ఆర్టీఐ కమిషనర్లు వారిపై విరుచుకుపడ్డారు. సమాచార కమిషనర్ల తీరుపై మిగతా ఉద్యోగులు మండిపడుతున్నారు.

# మూడవవిడత ప్రతిష్టాత్మకంగా "మొబైల్ రికవరీ మేళా"

నంద్యాల క్రైం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: పట్టణంలోని బొమ్మల సత్రం వద్దగల జిల్లా ఎస్పీ కార్యాలయంలో మూడో విడత మొబైల్ రికవరీ మేళ శుక్రవారం నిర్వహించడం జరిగింది. 1066 రికవరీ చేసిన సెల్ ఫోన్ల వాటి విలువ సుమారు 2,43,10,400 అని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో మొదటి మొబైల్ రికవరీ మేళాలో 847 సెల్ ఫోన్లు వాటి విలువ 1,52,98,029 రూపాయలు, రెండవ మొబైల్ కవర్ మేళాలో 510 సెల్ ఫోన్లు వాటి విలువ 86,57,000 రూపాయలు నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 2426 మొబైల్ లను రికవరీ చేయడం జరిగినది. మొత్తం వాటి విలువ 4,82,65,429 రూపాయలు ఉన్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవి రికవరీ చేసి ఇవ్వడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మొబైల్ లను వివిధ రాష్ట్ర లనుండి అనగా మహారాష్ట్ర, తమిళనాడు ,కర్ణాటక, గోవా, తెలంగాణా మొదలగు రాష్ట్రాల నుండి ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్టణం, తూర్పుగోదావరి, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం మొదలగు జిల్లాల నుండి మరియు నంద్యాల జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 1066 మొబైల్ ఫోన్ లు రికవరీ చేసి బాదితులకు అప్పగించడమైనది.వీటి విలువ సుమారు 2,43,10,400/– రూపాయలు ఉంది.

జిల్లాలోనే అతి తక్కువ సమయంలోనే వివిధ రాష్ట్రాల నుండి రికవరీ చేసిన 1066 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా పోలీసులు ముందు రోజే ఫోన్ల ను అందజేసేందుకు బాధితులకు సమాచారం అందించి నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంకు పిలిపించి బాధితులకు సెల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మొబైల్ మన జీవితంలో ఒక భాగమైందన్నారు. మొబైళ్లలో ప్రతి ఒక్కరూ వారి కుటుంబ మరియు వ్యాపార ఉద్యోగ సమాచారాలను ఒకరితో ఒకరు షేర్ చేసుకోవడానికి ప్రస్తుతం బాగా వినియోగిస్తామన్నారు అలాగే వ్యక్తి గత సమాచారం , బ్యాంకింగ్ సమాచారం మొదలగున్నవి ఆ మొబైల్ లలో ఉంటాయి కాబట్టి మొబైల్ ని జాగ్రత్త గా ఉంచుకోవాలి అని సూచించడం జరిగినది. మొబైల్ ఫోన్లతో పాటు ప్రజల ఆస్తిని కాపాడాల్సిన భాద్యత పోలీసులపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు కారణాలతో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న భాదితులు ఇచ్చిన వివరాలను బట్టి 1066 ఫోన్లు రికవరీ చేశామన్నారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరీ అయిన వాటి పరిష్కారం పై నంద్యాల జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. నంద్యాల జిల్లాలో మొబైల్ పోగొట్టు కున్నా వ్యక్తి ముందుగా 9121101107 అనే నెంబర్ వాట్స్ యాప్కు హాయ్ అని మెసేజ్ చేసినట్లైతే ఒక లింక్ ని మీరు రిసీవ్ చేసుకుంటారు. ఈ లింక్ ను క్లిక్ చేసి ఈ క్రింది వివరాలను మీ పేరు, మీ జిల్లా , మీ పోలీస్ స్టేషన్ పరిధి , మీ మొబైల్ పోగొట్టుకున్న స్థలము , మీ మొబైలుకు సంబంధించిన ఐఎంఈఐ–1, ఐఎంఈఐ–2 వివరాలు మీరు ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైలు నెంబర్, మొబైలు పోయినప్పుడు సదరు మొబైల్ నందు మీరు వాడినా మొబైల్ నెంబర్ కాంటాక్ట్ వివరాలు సబ్మిట్ చేయాలి. అలాగే ప్రతి ఒక్క మొబైల్ వినియోగదారు సిఈఐఆర్ పోర్టల్ గురించి విడిగా తెలుసుకొని దానిలో కూడా ఫిర్యాదు చేసినచో పోలీస్ వారు మీ మొబైలును మీకు తిరిగి తెప్పించి ఇవ్వగలరని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# లడ్డూల అంశాన్ని పక్కదారి పట్టించేందుకు డిక్లరేషన్ వివాదం: వైఎస్ జగన్

**"రాష్ట్రంలో ఎప్పుడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది. దైవ దర్శనానికి వెళ్తామంటే అడ్డుకునే ప్రయత్నం చేయడం దేశంలో ఎప్పుడూ జరిగి ఉండదు" అని వైకాపా అధినేత జగన్ అన్నారు.**



తాడేపల్లి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: దైవ దర్శనానికి వెళ్తామంటే అడ్డుకునే ప్రయత్నం చేయడం దేశంలో ఎప్పుడూ జరిగి ఉండదని అని వైకాపా అధినేత జగన్ అన్నారు. తిరుమల పర్యటన రద్దుపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "జగన్ తిరుమల పర్యటనకు అనుమతి లేదని మా పార్టీ నేతలకు పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భాజపా శ్రేణులను రప్పిస్తున్నారు. లడ్డూల అంశాన్ని పక్కదారి పట్టించేందుకు డిక్లరేషన్ అంశాన్ని తీసుకొచ్చారు. తిరుమల లడ్డూ పై చెప్పినవన్నీ అబద్ధాలని రుజువులు కనిపిస్తున్నాయి. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అసత్యాలు చెబుతున్నారు. తిరుమల పవిత్రతను, శ్రీవారి ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారు" అని జగన్ ఆరోపించారు.

## అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆధారాలు చూపిస్తాం..

"జంతువుల కొవ్వుతో ప్రసాదాలు చేశారని అబద్ధాలు చెబుతున్నారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆధారాలు చూపిస్తాం. తితిదేలో 6 నెలలకు ఒకసారి టెండర్లు పిలవడం దశాబ్దాలుగా జరుగుతున్నదే. తక్కువ రేటుకు కోట్ చేసిన వారికి తితిదే టెండర్ ఖరారు చేస్తుంది. దశాబ్దాలుగా జరుగుతున్న కార్యక్రమాన్ని వివాదాస్పదం చేస్తున్నారు. క్వాలిటీ చెక్ చేయించాకే వాహనాలు వస్తాయి. తితిదే కూడా క్వాలిటీ చెక్ చేస్తోంది. పరీక్షలో విఫలమైన వాహనాలను వెనక్కి పంపడం సాధారణం. గతంలో తెదేపా హయాంలో కూడా కొన్ని ట్యాంకర్లను వెనక్కి పంపించారు. కల్తీ ప్రసాదాలను భక్తులు తిన్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు. తితిదే బోర్డు సభ్యులుగా తీసుకోవాలని కేంద్రం, సీఎంలు సిఫారసు చేస్తారు. తితిదే బోర్డు సభ్యులు ప్రముఖులు.. పారదర్శకంగా పనిచేస్తారు" అని జగన్ అన్నారు.

## వాడని నెయ్యిని వాడినట్లు ఎందుకు అంటున్నారు

"తప్పు చేసేందుకు అవకాశం లేని వ్యవస్థలో తితిదే ఉంది. మా హయాంలోనూ 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపారు. శ్రీవారి ప్రసాదాల్లో వాడని నెయ్యిని వాడినట్లు ఎందుకు అంటున్నారు. అప్పుడప్పుడు నమూనాలను సీఎఫ్ టీఆర్ ఐ మైసూరుకు పంపిస్తారు. ఇప్పుడు నమూనాల పరీక్షకు మొదటిసారిగా గుజరాత్కు పంపారు. గుజరాత్ నుంచి వచ్చిన నివేదికను తెదేపా కార్యాలయం రిలీజ్ చేసింది. రహస్య నివేదిక అయితే తెదేపా ఆఫీసు నుంచి ఎలా బయటకు వస్తుంది? ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిని వాడలేదని తితిదే ఈవో చెప్పారు. సెప్టెంబరు 22న తితిదే ఈవో ప్రభుత్వానికి లేఖ పంపారు. తితిదే ఈవో పలుసార్లు చెప్పినా వినకుండా సీఎం మళ్లీ అబద్ధాలు చెప్పారు. రాజకీయంగా లబ్ధిపొందేందుకే ఇలా అబద్ధాలు ఆడుతున్నారు. తిరుమల ప్రసాదాలపై ఇలా దుష్ప్రచారం చేయడం అపవిత్రత కాదా?" అని జగన్ ప్రశ్నించారు.

# శ్రీవారిని దర్శించుకోవాలంటే సంప్రదాయాలు పాటించాల్సిందే: శ్రీనివాసానంద సరస్వతి

**శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ తెలిపారు.**



తిరుపతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా? మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటాం. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను ఆయన ఏనాడూ గౌరవించలేదు. హిందుత్వానికి కష్టమొచ్చింది.. అందరం ఒక్కటై కాపాడుకోవాలి. తిరుమల క్షేత్ర ప్రాశస్త్యాన్ని వైకాపా ప్రభుత్వం ఎప్పుడూ కాపాడలేదు. గత ఐదేళ్లలో ఎన్నో పాపాలు జరిగాయి.. ప్రక్షాళన జరగాల్సిందే. ఏనాడైనా డిక్లరేషన్పై జగన్ సంతకం చేశారా? ఆలయాలు, పూజారులపై దాడులు జరిగినా ఏనాడూ స్పందించలేదు. ఐదేళ్లలో అనేక అఘాయిత్యాలు జరిగాయి. భయానక వాతావరణం సృష్టించారు. ఇలాంటి వాళ్లు తిరుమల క్షేత్రానికి వస్తున్నారంటే జాగ్రత్తగా ఉండాల్సిందే. సనాతన పరిరక్షణ బోర్డు ఏర్పాటు కావాలి. దీనికి రాజకీయ పక్షాలన్నీ సహకరించాలి. జగన్, వైకాపాపై మాకు వ్యక్తిగత ద్వేషం లేదు. ఆలయాల సంప్రదాయాలను గౌరవించకపోవడాన్ని తప్పు పడుతున్నాం. డిక్లరేషన్ ఇచ్చేందుకు అభ్యంతరమేంటి? తిరుమల పర్యటనలో కోడికత్తి నాటకాలాడతారని అనుమానాలున్నాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తారనే అనుమానం కలుగుతోంది. గత ఐదేళ్లలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చారు. తమ కుటుంబ సభ్యులను పాలకమండలిలో నియమించుకుని అక్రమాలు చేశారు. తిరుమలను శాంతియాగం, ప్రోక్షణతో పవిత్రం చేశారు. జగన్ పర్యటనతో మళ్లీ అపవిత్రమవుతుంది. ఇక్కడికి వచ్చి మరింత క్షోభకు గురిచేయవద్దు" అని శ్రీనివాసానంద సరస్వతి వ్యాఖ్యానించారు.

# ఈనెల 30న భాజపా రైతు రుణమాఫీ అమలు సాధన దీక్ష

**ఈ నెల 30న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా 24 గంటల రైతు రుణమాఫీ అమలు సాధన దీక్ష చేపట్టనుంది.**

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: ఈ నెల 30న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా 24 గంటల రైతు రుణమాఫీ అమలు సాధన దీక్ష చేపట్టనుంది. ఇందిరా పార్క్ వద్ద చేయనున్న దీక్షా స్థలిని భాజపా శాసన సభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎస్వీ సుభాష్, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్లో లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ను తుంగలో తొక్కిందని భాజపా నేతలు విమర్శించారు. రైతు రుణమాఫీపై సీఎం, మంత్రులు విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందంటే, మంత్రులు మరికొంతమందికి చేస్తామని చెబుతున్నారన్నారు. రైతు భరోసా ఊసే లేదు. వడ్లకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. భాజపా చేసే పోరాటానికి రైతులు పెద్ద సంఖ్యలో మద్దతు తెలపాలని కోరారు.

# దేవర సినిమా చూస్తూ గుండెపోటుతో కుప్పకూలిన ఎన్టీఆర్ అభిమాని

**కడపలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ నటుడు ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా చూస్తూ ఓ అభిమాని గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.**

కడప, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 27: కడపలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ నటుడు ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా చూస్తూ ఓ అభిమాని గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీన్ని గమనించిన తోటి అభిమానులు ఆ వ్యక్తిని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలోని జమ్మలపల్లికి చెందిన మస్తాన్వలి జూనియర్ ఎన్టీఆర్ అభిమాని. దేవర సినిమా విడుదల సందర్భంగా కడప అప్సర థియేటర్లో ఈరోజు తెల్లవారుజామున సినిమా చూస్తూ ఈలలు, కేకలు వేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మస్తాన్వలికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మస్తాన్వలి మృతితో ఆ కుటుంబం అనాథగా మారింది. జూనియర్ ఎన్టీఆర్ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని అతని బంధువులు కోరారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1833: భారతీయ సంఘసంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ మరణం (జ. 1772).
- 1915: నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జననం (మ. 2012).
- 1933: దక్షిణ భారతదేశానికి చెందిన హాస్య, రంగస్థల నటుడు నగేష్ జననం (మ. 2009).
- 1953: హిందూ ఆధ్యాత్మిక గురువు మాతా అమృతానందమయి జననం.
- 1980: ప్రపంచ పర్యాటక దినోత్సవం.
- 1981: న్యూజిలాండ్ కు చెందిన అంతర్జాతీయ క్రికెటర్ బ్రెండన్ మెక్‌కలమ్ జననం.
- 1997: గాంధేయవాది, మాజీ రాష్ట్రమంత్రి మండలి వెంకటకృష్ణారావు మరణం (జ. 1926).
- 2001: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి మరణం (జ. 1920).
- 2008: భారతీయ నేపథ్య గాయకుడు మహేంద్ర కపూర్ మరణం (జ. 1934).


రామ్మోహన్ రాయ్


కొండా లక్ష్మణ్ బాపూజీ


మాతా అమృతానందమయి


ప్రపంచ పర్యాటక దినోత్సవం


బ్రెండన్ మెక్‌కలమ్


కోట్ల విజయభాస్కరరెడ్డి


మహేంద్ర కపూర్

# కల్తీ కేటుగాళ్ళు



- దీర్ఘకాలిక వినియోగంతో క్యాన్సర్, తదితర వ్యాధులు
- వ్యాపారస్తుల స్వార్థం.. ప్రజారోగ్యానికి భంగం
- తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- శాంపిళ్లు తీసి పరీక్షలకు పంపే ఆలోచన కరువు
- నూనెల్లో జంతువుల కొవ్వు అవశేషాలు
- ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తే వెలుగు చూడనున్న వాస్తవాలు



వ్యాపారస్తుల స్వార్థం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతోంది. పప్పులు కల్తీలు అవుతున్నాయన్నది అందరికీ తెలిసిందే. అయితే మనం నిత్యం వాడేవంట నూనెలు కూడా కొందరు కేటుగాళ్ళు కల్తీ చేస్తున్నారు. . తక్కువ ధరకు లభించే జంతువుల నుంచి తీసిన నూనెను కల్తీగాళ్ళు సాధారణ వంట నూనెలో వాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గృహ వినియోగదారుల సంగతి అలా ఉంచి జిల్లాలోని ఎన్నోరెస్టారెంట్లు, హొటళ్లలో కల్తీ నూనె వాడుతున్నట్లు తెలుస్తోంది. మసాలా కారణంగా రుచికి తక్కువ లేకపోవడంతో ఇటువంటి నూనెను వాడిన ఆహార పదార్థాలు తిన్నవారికి కాలక్రమంలో ఉదరకోశ సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులు కూడా వస్తున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన సంబంధిత అధికారులు వ్యాపారస్తుల వద్ద నుంచి ప్రయోజనాలు పొంది తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించినట్లు చూపుతూ నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు వంట నూనె అంటే వేరుశనగ నూనె మాత్రమే. అయితే కొంతమంది ఈ నూనె పట్ల అపోహలు సృష్టించడంతో కాలక్రమంలో ప్రజలు సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల కు వినియోగదారులుగా మారిపోయారు. అందున గుండె సంబంధిత సమస్యలు ఎక్కువయ్యే కొద్దీ రీఫైన్డు ఆయిల్ ను వినియోగించడం ప్రారంభమైంది. వాస్తవానికి వేరుశనగ నూనెలో ఉండే మంచి ఫ్యాట్ కంటెంట్ గుండెకు మేలు చేస్తుందని పరిశోధనలు స్పష్టం చేశాయి. వీటన్నింటినీ అలా ఉంచి ప్రజలు నిత్యం వాడుతున్న వంట నూనెలు కల్తీ అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విజయవాడ, గుంటూరు, తదితర ప్రాంతాల్లో జంతువుల నుంచి ఆయిల్ను తీసి శుద్ధి చేసి మామూలు నూనెల్లో కలిపి అమ్ముతున్న ట్లు గతంలో ఎన్నో దాడుల్లో స్పష్టం అయింది. ఆయా ప్రాంతాల నుంచి జిల్లాకు కూడా అతి తక్కువ ధరకే జంతువుల నూనె సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.ఆ నూనెను సాధారణ నూనెలో కలిపి వేస్తూ వ్యాపారస్తులు కోట్ల రూపాలయను ఆర్జిస్తున్నారు. అయితే జంతువుల నూనె పుల్లీ సాచురేటెడ్ ఫ్యాట్ కావడంతో ఆ నూనె వినియోగం చేసిన వారు కాలక్రమంలో గుండె జబ్బులు బారిన పడడంతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పలు హొటళ్లలో ఈ కల్తీ జంతు నూనెను మామూలు నూనెతో కలిపి వంటకాలు తయారుచేసి అమ్ము తున్నట్లు తెలుస్తోంది. నిత్యం హొటల్ భోజనాలు చేసే వారు అయితేనేమీ, తెలియక ఇటువంటి కల్తీ నూనే వాడే సామాన్య ప్రజలు అయితేనేమీ వ్యాధుల బారిన పడుతున్నారు. సాధారణ వంట నూనె ధర 150 నుంచి 180 వరకు వివిధ కంపెనీలు ఉన్నాయి. రీఫైన్డు ఆయిల్ అయితే ఇంకొంచెం ధర ఎక్కువగా ఉంటుంది. అయితే జంతువుల నుంచి తీసిన కల్తీ నూనె రూ. 50 నుంచి రూ. 70 లకే లభిస్తుండడంతో పలువురు హొటళ్ల యజమానులు ముఖ్యంగా మాంసాహార రెస్టారెంట్లు, హొటళ్ల వారు ఈ నూనెను ఎక్కువగా వినియో గిస్తున్నట్లు తెలుస్తోంది.

## కల్తీ వంటనూనెతో ప్రమాదంలో ప్రజారోగ్యం

### బ్రాండెడ్‌ఆయిల్ కంపెనీలను డూప్లికేట్ చేస్తున్న కల్తీగాళ్ళు


#### ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం..



సాధారణంగా మానవుడికి నిత్య జీవన ప్రయాణంలో శరీర కదలికలకు కొవ్వు అవసరం. అయితే తీసుకునే ఆహార పదార్థాల్లో కొవ్వు ఎక్కువై .. కదలికలు తగ్గి అంటే ఎటువంటి శ్రమ లేకపోతే అదనపు కొవ్వులుగా శరీరంలో పేరుకుంటాయి. మంచి వంట నూనె శరీరం కరిగించుకునే స్థితిలోనే ఫ్యాట్ను కలిగి ఉంటుంది. అయితే జంతువుల కొవ్వు నుంచి తీసిన నూనెను శరీరం కరిగించుకోలేదు. దీంతో ఆయా నూనెలను వినియోగించిన ఆహార పదార్థాలను నిత్యం తీసుకుంటుంటే శరీరంలో ప్రమాదకర స్థాయిలో సంతృప్త కొవ్వులు పెరగిపోయి గుండెజబ్బులకు కారణం అవుతుంది. ఇటీవల నంద్యాల సర్వజన ఆస్పత్రికి, ప్రైవేట్ ఆస్పత్రులకు ఉదరకోశ వ్యాధులతో వస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. అటువంటి కేసుల్లో ఇటువంటి కలుషిత నూనెలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఒక్క సాధారణ వంట నూనె మాత్రమే కాకుండా రీఫైన్డు ఆయిల్ కూడా కల్తీకి గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

#### తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు..

కాగా, జిల్లాలోని పలు హొటళ్లపై ఇటీవల జరిగిన దాడుల్లో వారు నిల్వ ఉంచిన మాంసాహారాన్ని వినియోగిస్తున్నట్లు స్పష్టం అయింది. అటువంటి మాంసాహార హొటళ్లలో ఇటువంటి కల్తీ నూనెను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కల్తీ నూనెతో తయారుచేసే ఆహార పదార్థాలు రుచి బాగుండడమే కాకుండా ధర కుడా తక్కువకే వస్తుండడంతో పలువురు హొటళ్ల యజమానులు ఈ నూనె వినియోగంపై మక్కువ చూపుతున్నారు. తనిఖీలు నిర్వహించిన ఆహార, తదితర శాఖల అధికారులు కేవలం ఆహారాన్ని తనిఖీ చేస్తున్నారు తప్పితే వారు ఎటువంటి దినుసులు, సరుకులు వాడుతున్నారన్న దానిపై దృష్టి సారించడం లేదు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సిన ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ ,పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంబంధిత విభాగాలు వ్యాపారస్తుల నుంచి ప్రయోజనాలు పొందుతూ తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి అన్ని బాగున్నాయని నివేదికలు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కల్తీ నూనెల



కారణంగా ప్రజారోగ్యం ప్రమాదంలో ఉందన్నది వాస్తవం. మరింత పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి రాగలవు.

#### బ్రాండెడ్ నూనెలను డూప్లికేట్ చేస్తున్న కల్తీగాళ్ళు

జిల్లాలో ప్రముఖ బ్రాండెడ్ వంటనూనెలను కూడా ఈ కల్తీగాళ్ళు డూప్లికేట్ చేస్తున్నారు. జిల్లాలో నందికొట్కూరు, పట్టణంలోని వైఎస్ నగర్,నూనెపల్లె ప్రాంతాలలో కల్తీ నూనెను తయారు చేసి వీటిపై ప్రముఖ కంపెనీల లోగోలను వేసి దుకాణాలలో సరపరా చేస్తున్నారు. ఈ స్కాంలో ఆయా కంపెనీల మార్కెటింగ్ ఉద్యోగులు కూడా పాలుపంచుకోని నెలకు లక్షల రూపాయల అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. ఈ డూప్లికేట్ ఆయిల్ బ్రాండ్‌లను జిల్లాలోకి తీసుకొని రావడంతో పాటు దుకాణాలలో చేర్చడంలో సేల్ టాక్స్, చెక్‌పోస్టు యంత్రాంగం కూడా సహాయపడుతూ ఆమ్యామ్యలకు అలవాటు పడినట్లు సమాచారం. పార్టీలు అధికారం మారిన ఎప్పటికప్పుడు అధికార పార్టీ నాయకులతో ఈ కేటుగాళ్ళు అంటకాగుతూ తమ కల్తీ మాఫియాకు అడ్డు లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు.ప్రజలు మాత్రం ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ వంట నూనెతో తమ గుండె పదిలం అని భ్రమలో గుటకలు వేస్తూ వంటలను ఆస్వాదిస్తున్నారు.




నంద్యాల టౌన్, సెప్టెంబర్ 27 (రిపబ్లిక్ న్యూస్) ఎస్.భాస్కర్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# రోహిత్ షాకింగ్ నిర్ణయం..
# 9 ఏళ్లలో తొలి కెప్టెన్

## బంగ్లాదేశ్తో రెండో టెస్టులో భారత కెప్టెన్ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యానికి గురిచేసింది. తొమ్మిదేళ్ల తర్వాత హిట్మ్యాన్ తొలి కెప్టెన్‌గా నిలిచాడు.



కాన్పూర్ వేదికగా భారత్- బంగ్లాదేశ్‌ల మధ్య రెండో టెస్టు ప్రారంభమైంది. వర్షాలు పడటంతో మైదానం చిత్తడిగా మారి మ్యాచ్ మొదలయ్యేందుకు కాస్త సమయం పట్టింది. టాస్ నెగ్గిన కెప్టెన్ రోహిత్ శర్మ బౌలింగ్ ఎంచుకొని అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఇందులో షాక్ అవడానికి ఏముందంటారా? సాధారణంగా స్వదేశంలో జరిగే మ్యాచుల్లో ఎక్కువగా టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్లు బౌలింగ్ను తీసుకోవడం చాలా అరుదు. కానీ, రోహిత్ 9 ఏళ్ల తర్వాత తొలిసారి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గమనార్హం. చివరిసారిగా 2015లో విరాట్ కోహ్లి ఇలానే దక్షిణాఫ్రికాపై తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మరి ఇప్పుడు ఈ రెండో టెస్టు ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

### ఇద్దరు స్పిన్నర్లతోనే..

సాధారణంగా కాన్పూర్ పిచ్ స్పిన్కు అనుకూలంగా ఉంటుంది. దీంతో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతుందని అంతా భావించారు. అనూహ్యంగా ముగ్గురు పేసర్లను తుది జట్టులోకి తీసుకున్న రోహిత్ ఇద్దరు స్పిన్నర్లను ఆడిస్తున్నాడు. వర్షం కారణంగా మైదానం తడిగా ఉండటతో ఆ పరిస్థితులను ఉపయోగించుకొనేందుకు ఇలాంటి నిర్ణయం తీసుకొని ఉంటాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు. కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వస్తాడనుకున్నా.. అతడికి మరికొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది.

# బ్యూటీ టిప్స్

## ముఖాన్ని ఇలా వారానికి రెండు సార్లు మసాజ్ చేస్తే మెరవడం పక్కా

అందంగా కనిపించేందుకు చాలా మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఇందులో ఫేషియల్ మసాజ్ కూడా కీ రోల్ పోషిస్తుంది. దీని వల్ల చాలా లాభాలున్నాయి. అవేంటో తెలుసుకోండి. అందమే ఆనందం అంటారు. అవును నిజమే.. అందంగా ఉన్నప్పుడు మనలో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. అందుకోసం మనలో చాలా మంది ఫేషియల్స్ చేయించుకోవడం, రకరకాల క్రీమ్స్ వాడడం చేస్తుంటారు. దీనిని వల్ల డబ్బు ఖర్చు అవుతుంది. వచ్చిన బెనిఫిట్స్ కూడా శాశ్వతం కాదు. కానీ, ఫేషియల్ మసాజ్ చేయడం వల్ల ముఖంపై ఉన్న చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటి? ఫేషియల్ మసాజ్ ఎలా చేయాలో తెలుసుకోండి.



### యవ్వనంగా..



ఫేషియల్ మసాజ్ చేయడం వల్ల స్కిన్ ఎలాస్టిసిటీ పెరుగుతుంది. దీని వల్ల మజిల్స్ టోన్ అవుతాయి. ఫేషియల్ మజిల్స్ మెరుగ్గా పనిచేస్తాయి. దీంతో ఎలాస్టిసిటీ పెరిగి యవ్వనంగా కనపడేలా చేస్తుంది. ముడతలు రాకుండా చూడగానే యూత్‌ఫుల్ స్కిన్ మీ సొంతమవుతుంది.

### రక్తప్రసరణ..

ఫేషియల్ మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరుగుతుంది. దీని వల్ల ఆక్సిజన్, పోషకాలు స్కిన్‌కి అందుతాయి. దీంతో స్కిన్ కూడా చక్కగా అందంగా, మెరుస్తుంది. అంతేకాకుండా దీని వల్ల కొల్లాజెన్ ప్రోడక్షన్ పెరిగి వయసు పెరిగే కొద్దీ వచ్చే ముడతలు రాకుండా ఉంటాయి.



### స్కిన్ ప్రాబ్లమ్స్..



ఫేషియల్ మసాజ్ చేయడం వల్ల స్కిన్ ప్రాబ్లమ్స్ దూరమవుతాయి. ముఖ్యంగా యాక్నే, స్కార్స్ వంటి సమస్యలు దూరమవుతాయి. ఫేషియల్ మసాజ్ చేయడం వల్ల ట్యాక్సిన్స్ తగ్గిపోతాయి. దీని వల్ల ముఖంపై వాపు, పఫీనెస్ తగ్గుతుంది. అదే విధంగా, డల్‌గా ఉన్న స్కిన్ తాజాగా మారుతుంది. అప్పటికప్పుడు మీకు రిజల్ట్ కనిపిస్తుంది.


### సైనస్..

ఫేషియల్ మసాజ్‌తో కేవలం అందం పెరగడం మాత్రమే కాదు. ఆరోగ్యం కూడా బాగుంటుంది. దీని వల్ల సైనస్ వంటి సమస్యలు దూరమవుతాయి.



### మూడ్ మారడం..

అదేంటి.. ఫేషియల్ మసాజ్‌తో మూడ్ మారడం ఏంటనుకోవద్దు. దీని వల్ల మజిల్స్ రిలాక్స్ అవుతాయి. దీంతో మీలో ఒత్తిడి, యాంగ్జైటీ లెవల్స్ తగ్గి మూడ్ మారుతుంది. దీంతో హ్యాపీగా ఉంటారు.



### సైనస్..ఎలా చేయాలి..

ముందుగా చేతుల్ని శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత ఆయిల్‌తో మీ ముఖంపై ఉన్న మేకప్, దుమ్ముని క్లీన్ చేసుకుని తర్వాత ముఖాన్ని శుభ్రంగా క్లీన్ చేసుకోండి.


తర్వాత వీలైతే ఓసారి ముఖానికి ఆవిరిపట్టండి.

ఇప్పుడు వాడాలనుకున్న నూనె, సీరమ్‌ని కొద్దిగా డబుల్ బాయిల్ మెథడ్‌లో గోరువెచ్చగా చేసి మీ అరచేతిలో వేయండి. ఇప్పుడు ఆ ఆయిల్‌తో నుదురు, కళ్ళ చుట్టూ, బుగ్గలు, చీక్స్, లిప్స్, మెడ భాగంలో మెల్లిగా మసాజ్ చేయండి. ఇలా నిదానంగా మసాజ్ చేయండి. మసాజ్‌లో ఎక్కువగా చూపుడు, మధ్య వేళ్ళతో మసాజ్ చేయండి. ఇలా వారానికి వీలైతే 2, 3 సార్లు లేదంటే ఒక్కసారైనా చేయడం వల్ల ముఖం కాంతివంతంగా మెరుస్తూ కనిపిస్తుంది.

గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.